ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5 తమిళనాడు TAMILNADU

బుధవారం 3 జూలై 2024

జైళ్ల శాఖలో 49 మందికి పోస్టింగ్

● నియామకపత్రాలు అందజేసిన సీఎం స్టాలిన్



నియామక ఉత్తర్వులు అందజేస్తున్న ముఖ్యమంత్రి

ప్యారీస్, జూలై 2: రాష్ట్ర జైళ్ల శాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి స్టాలిన్ ఐదుగురు జైలర్లు, 44 సహాయక అధికారులకు ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందజేశారు. 2023-24వ ఆర్థిక సంవత్సరంలో జైలు ఖైదీల సంక్షేమార్థం నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా రాష్ట్రప్రభుత్వం ఆహార పంపిణీకి రూ.26 కోట్లు అదనంగా కేటాయించింది. జైళ్లలో ఆహారం తయారీకి అవసరమైన గ్రైండర్, పిండి యంత్రాలు సరఫరా చేయడంతో పాటు ఖైదీలకు సమయానికి ఆహారం అందేలా రూ.1.23 కోట్లతో ఈ-ఆటోలను కూడా పంపిణీ చేసింది. జైళ్లలో చట్టవిరుద్ధ కార్యకలాపాలు నివారించే దిశగా రూ.11.50 కోట్లతో 600 సీసీ కెమెరాలను పొందుపరచాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్నీ కేంద్ర కారాగారాల్లో పనిచేస్తున్న ఉద్యోగులతో పాటు శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు వసతులు మెరుగుపరచింది. తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ ద్వారా ఎంపికైన ఐదుగురు జైలర్లు, మరో 44 మంది అధికారులకు ఉద్యోగ నియామక ఉత్తర్వులను సీఎం స్టాలిన్ అందజేశారు. వీరు వేలూరులో ఉన్న శిక్షణ కేంద్రంలో 9 నెలలు శిక్షణ పొందుతారని సచివాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

మత్తు కోసమే మెథనాల్ కలిపాం

● కళ్లకుర్చి సారా వ్యాపారుల వాంగ్మూలం



కల్తీసారా వ్యాపారులు కన్నుకుట్టి అలియాస్ గోవిందరాజ్, విజయ, దామోదరన్

అడయార్, జూలై 2: కిక్కు (మత్తు) కోసం మెథనాల్ కలిపి కల్తీసారాను తయారు చేసి విక్రయించినట్టు కళ్ళకుర్చి ఘటనకు ప్రధాన సూత్రధారులైన సారా వ్యాపారులు గోవిందరాజ్, ఆయన భార్య విజయ సీబీసీఐడీకి ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నారు. గత నెలలో కళ్ళకుర్చిలో కల్తీసారా తాగి 229 మంది అస్వస్థతకు గురికాగా, వారిలో 65మంది చనిపోయారు. మరో 15 మందివరకు ప్రాణాపాయస్థితిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో ఈ కేసు విచారణను సీబీసీఐడీకి ప్రభుత్వం అప్పగించింది. దీంతో సీబీసీఐడీ ఏడీఎస్పీ గోమతి సారథ్యంలోని ప్రత్యేక బృందం ఈ కేసు విచారణను ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. ఈ కేసులో ఇప్పటివరకు 21 మందిని అరెస్టు చేశారు. వీరిలో కల్తీసారా తయారీ వ్యాపారులైన గోవిందరాజ్, ఈయన భార్య విజయ ఉన్నారు. వీరితో పాటు పుదుచ్చేరికి చెందిన మాదేష్ సహా మొత్తం 11 మందిని కస్టడీలోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు. గోవిందరాజ్ దంపతులు సీబీసీఐడీకి కీలక వాంగ్మూలం ఇచ్చారు. కళ్ళకుర్చి ప్రాంతంల్లో చాలాకాలంగా సారా వ్యాపారం చేస్తున్నట్టు చెప్పారు. తాము తయారు చేసిన సారాను కల్వరాయన్‌మలైతో పాటు అనేక ప్రాంతాలకు చెందిన చిన్న వ్యాపారులు కొనుగోలు చేసి విక్రయించేవారని తెలిపారు. ఈ సారా తాగిన వారు మత్తు రావడం లేదన్నారని, సారా తయారీలో మెథనాల్ కలిపినట్టయితే మత్తు వస్తుందని పలువురు చెప్పారన్నారు. దీంతో చెన్నైలోని ఒక కెమికల్ ఫ్యాక్టరీలో మెథనాల్‌ను కొనుగోలు చేసి సారా తయారీలో ఉపయోగించామన్నారు. ఆ రోజు తయారు చేసిన సారా తాగిన వారిలో పలువురు కడుపునొప్పి, వాంతుల, విరేచనాలు కావడంతో అస్వస్థతకు లోనయ్యారని తెలిపారు. చివరకు అది కల్తీసారాగా మారిందని తెలిసిందని వారు వాంగ్మూలం ఇచ్చారు. అలాగే, చెన్నై మాధవరం ప్రాంతానికి చెందిన కెమికల్ ఫ్యాక్టరీ యజమానులు బన్సీలాల్, గౌతమ్ చంద్‌లను కూడా సీబీసీఐడీ పోలీసులు విచారణ జరిపారు. పుదుచ్చేరి మాదేష్ అనే వ్యక్తికి 190 కేజీల సామర్థ్యంతో కూడిన 19 బ్యారెల్లో మెథనాల్ సరఫరా చేసినట్టు చెప్పారు. మరోవైపు సీబీసీఐడీ అధికారులు రెండో రోజైన మంగళవారం కూడా మరికొందరు నిందితుల వద్ద విచారణ జరిపారు.

కోవై మేయర్ రాజీనామా?

● అదేబాటలో తిరునల్వేలి మేయర్ !



కోయంబత్తూరు మేయర్ కల్పన



తిరునల్వేలి మేయర్ శరవణన్

చెన్నై, జూలై 2 (ఆంధ్రజ్యోతి): వాణిజ్యనగరం కోయంబత్తూరు కార్పొరేషన్ మేయర్ కల్పన తన పదవికి రాజీనామా చేసినట్లు డీఎంకే వర్గాల ద్వారా తెలిసింది. పాలనవ్యవహారాల్లో ఆమె భర్త జోక్యం అధికంగా ఉండటం వల్ల అసంతృప్తి చెందిన కార్పొరేటర్లు ఆమెపై అధిష్ఠానవర్గానికి ఫిర్యాదులు చేశారు. ఆ నేపథ్యంలోనే ఆమె తన పదవికి రాజీనామా చేసినట్లు చెబుతున్నారు. కోయంబత్తూరు కార్పొరేషన్‌లో మొత్తం 100 మంది కార్పొరేటర్లున్నారు. వీరిలో 97 మంది డీఎంకే, కాంగ్రెస్ కూటమి అభ్యర్థులు కాగా, ముగ్గురు అన్నాడీఎంకే కార్పొరేటర్లు. ఈ కార్పొరేషన్‌కు డీఎంకేకు చెందిన కల్పన మేయర్‌గా ఎంపికయ్యారు. ఈమె ఉన్నట్లు పార్టీ నిర్వాహకులు చెబుతున్నారు. మేయర్ లేకపోవడంతో ప్రజావిజ్ఞప్తుల దినాన్ని కూడా రద్దు చేశారు. ఇదే విధంగా మంగళవారం కోయంబత్తూరు నగరంలో మేయర్ పాల్గొనాల్సిన కొన్ని కార్యక్రమాలు కూడా రద్దు చేశారు. ప్రతి మంగళవారం జరిగే ప్రజా విజ్ఞప్తుల దినం ఆకస్మికంగా రద్దు చేయటం తీవ్ర కలకలం సృష్టించింది. ఈ విషయమై ఆనందకుమార్ మీడియాతో మాట్లాడుతూ మేయర్ ప్రస్తుతం అనారోగ్యంతో ఉన్నారని, ఇంటివద్దే విశ్రాంతి తీసుకుంటున్నారని క్లుప్తంగా బదులిచ్చారు. కొందరు డీఎంకే కార్పొరేటర్లు మాట్లాడుతూ మేయర్ కల్పన తప్పకుండా తన పదవికి రాజీనామా చేస్తారని ఎప్పటికుంది. అప్పట్లో పార్టీకి యేళ్లతరబడి సేవ చేస్తున్న సీనియర్ నేతలకు తమ మద్దతుదారులైన కార్పొరేటర్లలో ఒకరికి మేయర్ పదవినివ్వాలంటూ డీఎంకే అధిష్ఠానంపై ఒత్తిడి చేశారు. అయితే ఊహించని విధంగా కల్పనను డీఎంకే అధిష్ఠానం మేయర్ అభ్యర్థిగా ప్రకటించడంతో పార్టీ సీనియర్ నేతలంతా తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు. సామాన్య కుటుంబం నుండి వచ్చిన కల్పన కోవై కార్పొరేషన్ తొలి మహిళా మేయర్‌గా పేరు గడించారు. ఆ తర్వాత కొన్ని సమస్యలు ఆమెను చుట్టుముట్టాయి. మేయర్ తల్లి నివసిస్తున్న ఇంటికి ఎదురింటిలో ఉన్న మహిళతో గొడవపడటంతో ఆమె పోలీసు కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. అది చర్చనీయాంశంగా మారింది. ఆ తరువాత సంతలో వసూళ్లు చేసే విషయమై మేయర్ భర్త ఆనందకుమార్ ఫోన్ సంభాషణ కూడా వివాదాస్పదంగా మారాయి. వీటన్నింటికి తోడు ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో మేయర్ కల్పన ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులో డీఎంకే అభ్యర్థికంటే బీజేపీ అభ్యర్థికి అదనంగా 330 ఓట్లు పడటం డీఎంకే అధిష్ఠానానికి తీవ్ర ఆగ్రహం కలిగించింది. ఆ సంఘటనపై పార్టీ అధిష్ఠానం స్థానిక నాయకుల ద్వారా విచారణ కూడా జరిపింది. ఈ పరిస్థితుల్లోనే మేయర్ కల్పన

19వ వార్డులో పోటీ చేసి కార్పొరేటర్‌గా గెలిచారు. ఈమె భర్త ఆనందకుమార్ డీఎంకే స్థానిక నాయకుడు. మేయర్‌గా కల్పన బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఆమెపై పలు ఆరోపణలు బయలుదేరాయి. వీటన్నింటికి ఆమె భర్త ఆనందకుమార్ రాజకీయ జోక్యమే ప్రధాన కారణమని భావిస్తున్నారు. పైగా డీఎంకే కౌన్సిలర్లు, పార్టీ నిర్వాహకులు ఆయనపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. దీంతో డీఎంకే కార్పొరేటర్లు తరచూ మేయర్‌పై వ్యతిరేకత ప్రదర్శిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కల్పన తన మేయర్ పదవికి రాజీనామా చేశారని, ఆ మేరకు రాజీనామా లేఖను డీఎంకే అధిష్ఠానానికి పంపారని కోయంబత్తూరు నగరమంతటా కోడై కూస్తోంది. రాజీనామా లేఖను అధిష్ఠానంకు స్వయంగా అందజేసేందుకు ఆమె చెన్నైలోనే బసచేస్తున్నారని చెబుతున్నారు. దీనికి తోడు మంగళవారం ఉదయం కోయంబత్తూరులో ప్రజా విజ్ఞప్తులదినంలో మేయర్ పాల్గొనకపోవడంతో ఆమె చెన్నైలోనే నుంచో ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. కోయంబత్తూరు కార్పొరేషన్ ఎన్నికల్లో ఇన్‌ఛార్జి మంత్రి సెంథిల్ బాలాజీ డీఎంకే కూటమి విజయానికి తీవ్రంగా పాటుపడ్డారు. సెంథిల్ బాలాజీ వ్యూహం వల్లే కూటమి ఘనవిజయం సాధించి 97 వార్డులు కూడా గెలుచు తన పదవికి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. ఒక వేళ కల్పనా రాజీనామాను పార్టీ అధిష్ఠానం ఆమోదిస్తే ఆ పదవి కోసం అప్పుడే కొంత మంది మహిళా కార్పొరేటర్లు తమ మద్దతుదారుల ద్వారా తీవ్ర ప్రయత్నాలు కూడా ప్రారంభించారు.

తిరునల్వేలి మేయర్ కూడా...

తిరునల్వేలి కార్పొరేషన్ మేయర్ శరవణన్ కూడా తన పదవికి రాజీనామా చేసినట్లు డీఎంకే వర్గాలు పేర్కొంటున్నాయి. శరవణన్ కూడా గత రెండు రోజులుగా చెన్నైలోనే ఉండి పార్టీ సీనియర్లను కలుసుకుని తన రాజీనామా లేఖ అందించినట్లు తెలుస్తోంది. తిరునల్వేలి కార్పొరేషన్‌లో మొత్తం 55 మంది కార్పొరేటర్లున్నారు. వీరిలో 51 మంది, డీఎంకే, కాంగ్రెస్, మిత్రపక్షాలకు చెందిన సభ్యులు కాగా, తక్కిన నలుగురు అన్నాడీఎంకే కార్పొరేటర్లు. డీఎంకేకు చెందిన శరవణన్‌ను ఆ కార్పొరేషన్ మేయర్‌గా ఎన్నుకున్నారు. మేయర్ పదవిని చేపట్టినప్పటి నుంచి కార్పొరేటర్లకు, ఆయనకు అన్ని విషయాలలోను మనస్పర్థలు ఏర్పడుతున్నాయి. కార్పొరేషన్ సమావేశాలకు సైతం మెజారిటీ డీఎంకే కార్పొరేటర్లు మేయర్ వైఖరికి నిరసనగా గైర్హాజరుకావటం ఆనవాయితీగా మారింది. ఓ దశలో డీఎంకే సభ్యులంతా కలిసి మేయర్ శరవణన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టేందుకు కమిషనర్‌కు లేఖ ఇచ్చి కలకలం రేపారు. పార్టీ సీనియర్ నేతలు ఆగమేఘాలపై వెళ్ళి మేయర్‌కు, అసమ్మతివర్గం కార్పొరేటర్లకు రాజీ కుదర్చటంతో పరిస్థితి కాస్త సద్దుమణిగింది. ఆ తర్వాత కూడా మేయర్‌కు, కార్పొరేటర్లకు మధ్య ఘర్షణ ధోరణే కొనసాగింది. ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన కార్పొరేషన్ సమావేశానికి పదిమంది కార్పొరేటర్లు మాత్రమే హాజరయ్యారు. తక్కిన వారందరూ మేయర్ వైఖరిని ఖండిస్తూ సమావేశాన్ని బహిష్కరించారు. ఈ విషయం తెలుసుకున్న డీఎంకే అధిష్ఠానవర్గం మేయర్ శరవణన్‌ను చెన్నైకి పిలిపించింది. ఆ ప్రకారం శరవణన్ రెండు రోజుల క్రితమే చెన్నై చేరుకుని నగరపాలక శాఖ మంత్రి కేఎన్ నెహ్రూను కలుసుకున్నారు. తిరునల్వేలి కార్పొరేషన్‌లో కార్పొరేటర్లకు, మేయర్ మధ్య కొనసాగుతున్న మనస్పర్థలు, వివాదాలు గురించి మంత్రి కేఎన్ నెహ్రూ అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశం అనంతరం మేయర్ శరవణన్ డీఎంకే అధిష్ఠానవర్గంకు రాజీనామా లేఖ సమర్పించినట్లు తెలుస్తోంది. ఈ విషయమై డీఎంకే అధిష్ఠానవర్గం త్వరలోనే అధికారిక ప్రకటన జారీ చేస్తుందని డీఎంకే వర్గాలు చెబుతున్నాయి.

విక్రవాండిలో ఊపందుకున్న ప్రచారం

● ఇంటింటా తిరుగుతున్న మంత్రులు



మంత్రులు సీవీ గణేషన్, పీకే శేఖర్‌బాబు



విక్రవాండిలో కలకలం సృష్టిస్తున్న మాజీ సీఎం జయలలిత ఫొటోతో పీఎంకే పోస్టర్

చెన్నై, జూలై 2 (ఆంధ్రజ్యోతి): విక్రవాండి శాసనసభ నియోజకవర్గంలో ప్రధాన పార్టీల ప్రచారం ఊపందుకుంది. అభ్యర్థులకు మద్దతుగా ఇంటింటి ప్రచారం చేస్తూ కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. విల్లుపురం జిల్లా విక్రవాండి శాసనసభ నియోజకవర్గం ఉప ఎన్నిక ఈ నెల 10న జరుగనుంది. డీఎంకే తరఫున అన్నియూరు శివా, పీఎంకే తరఫున సీ.అన్బుమణి, నామ్ తమిళర్ కట్చి అభ్యర్థిగా డాక్టర్ అభినయా పోటీ చేస్తున్నారు. వీరితోపాటు 28 మంది ఇండిపెండెంట్లు కూడా పోటీపడుతున్నారు. విక్రవాండి ఉప ఎన్నికలను బహిష్కరిస్తున్న ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటించారు. ఆ పార్టీ మిత్ర పక్షం డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత కూడా విక్రవాండి ఎన్నికలకు దూరంగా ఉంటామని స్పష్టం చేశారు. దీంతో ఈ నియోజకవర్గంలో త్రిముఖ పోటీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో మంగళవారం ఉదయం నుంచి ఆ నియోజకవర్గంలో పార్టీ ప్రచారం తీవ్రస్థాయికి చేరింది. అటు డీఎంకే తరఫున మంత్రులు, ఇటు పీఎంకే తరఫున ఆ పార్టీ అధ్యక్షుడు అన్బుమణి రాందాస్ ఇతర నేతలు, మరో వైపు నామ్‌తమిళర్ కట్చి తరఫున ఆ పార్టీ సమన్వయకర్త సీమాన్ నియోజకవర్గమంతటా పర్యటిస్తూ ప్రచారం చేస్తున్నారు.

జయ బొమ్మతో పీఎంకే పోస్టర్...


ఈ ఎన్నికల్లో పోటీ చేస్తున్న పీఎంకే మాజీ ముఖ్యమంత్రి జయలలిత ఫొటోతో ముద్రించిన పోస్టర్లను నియోజకవర్గమంతటా అతికించింది. ఈ విషయం తెలుసుకున్న అన్నాడీఎంకే సీనియర్ నేత, మాజీ మంత్రి డి.జయకుమార్ పీఎంకేపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ నియోజకవర్గంలోని అన్నాడీఎంకే కార్యకర్తలుగానీ, పార్టీ ప్రముఖులు పీఎంకే అభ్యర్థికి ఓటేసే ప్రసక్తేలేదని స్పష్టం చేశారు.

మంత్రుల ప్రచారం...

ఇదిలా ఉండగా డీఎంకే అభ్యర్థి అన్నియూరు శివకు మద్దతుగా రాష్ట్రమంత్రులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆ నియోజకవర్గంలోని కుత్తాంపూండి, మేట్టు వీధి తదితర ప్రాంతాల్లో నీటి వనరుల శాఖ మంత్రి దురైమురుగన్, ఉన్నత విద్యాశాఖ మంత్రి సి.పొన్ముడి, దేవాదాయ శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు, కార్మిక సంక్షేమ శాఖ సవీ గణేశన్ తదితరులు ప్రచారం చేశారు. డీఎంకే చిహ్నమైన ఉదయసూర్యుడి గుర్తుపై ఓటేసి గెలిపించమంటూ కరపత్రాలను పంపిణీ చేశారు. వీరితోపాటు ఎంపీ ఎస్.జగద్రక్షగన్, శాసనసభ్యులు తాయగం కవి, జోసెఫ్ సామువేల్, పార్టీ స్థానిక శాఖ నాయకులు తమిళ్‌వేందన్, ఐసీఎఫ్ మహమ్మద్, విల్లుపురం నగర కార్యదర్శి చక్కరై, విక్రవాండి నగర శాఖ అధ్యక్షుడు అబ్దుల్‌సలాం కూడా ప్రచారం చేశారు.

వృద్ధులకు ఉచిత ఆధ్యాత్మిక యాత్ర

మంత్రి శేఖర్ బాబు ప్రకటన ● దరఖాస్తుల ఆహ్వానం



అడయార్, జూలై 2: రాష్ట్రంలోని సీనియర్ సిటిజన్లకు హిందూ దేవాదాయ ధర్మాదాయ శాఖ శుభవార్త ప్రకటించింది. 60 యేళ్ళు దాటి 70 యేళ్ళలోపు సీనియర్ సిటిజన్లకు ఉచితంగా ఆధ్యాత్మిక యాత్రఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొంది. పవిత్రమైన ఆడిమాసాన్ని పురస్కరించుకుని అమ్మవారి ఆలయాలకు ఈ ఆధ్యాత్మిక యాత్ర కొనసాగుతుందని దేవాదాయశాఖ మంత్రి పీకే శేఖర్ బాబు వెల్లడించారు. ఈ విషయంపై ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024-25 వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెడుతున్నప్పుడు దేవాదాయ పద్దులపై చర్చ జరిగే సమయంలో ఆడి, పురటాసి నెలల్లో ఉచిత ఆధ్యాత్మిక యాత్ర కల్పిస్తామని ప్రకటించారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.50 లక్షల కేటాయించిందని తెలిపారు. ముఖ్యంగా ఆర్థిక స్థోమత లేని వృద్ధులకు ఈ యాత్రను కొనసాగిస్తామన్నారు. ఆ ప్రకారంగా చెన్నై, తంజావూరు, కోయంబత్తూరు, తిరుచ్చి, మదురై, తిరునెల్వేలి జోన్లలో ని ప్రసిద్ధ అమ్మవారి ఆలయాలకు ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. చెన్నై జోన్‌లో మైలాపూర్‌లోని కర్పగమ్మాల్ ఆలయం, ప్యారీస్‌లోని కాళికాంబాళ్ ఆలయం, తిరువొత్తియూరులోని వడివుడి అమ్మన్ ఆలయం, మాంగాడులోని కామాక్షి అమ్మన్ ఆలయం, తిరువేర్కాడులోని దేవి కరుమారి అమ్మన్ ఆలయాలకు ఈ ఆధ్యాత్మిక యాత్ర కొనసాగుతుందన్నారు. అదేవిధంగా ఆయా జోన్ల పరిధిలో ఈ యాత్ర కొనసాగించేలా అధికారులు చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ యాత్ర నాలుగు దశల్లో అంటే ఈ నెల 19, 26, ఆగస్టు 2, 9 తేదీల్లో ఆయా జోన్లలో జరుగుతుందన్నారు. ఈ ఆధ్యాత్మిక యాత్రలో పాల్గొనేందుకు 60 యేళ్ళు పైబడి 70 యేళ్ళలోపు వృద్ధులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాల కోసం దేవాదాయ శాఖ టోల్‌ఫ్రీ నంబర్ 1800 4253 1111, చెన్నై జోన్ 99417 02075, 044-29520937, తంజావూరు జోన్ 0436-2238114, కోయంబత్తూరు జోన్ 0422-2244335, తిరుచ్చి జోన్ 0431-2232334, మదురై జోన్ 0452-2346445, తిరునెల్వేలి జోన్ 0462-2572783 అనే ఫోన్ నంబర్లలో సంప్రదించి తెలుసుకోవచ్చని మంత్రి శేఖర్ బాబు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

రాష్ట్రపతి దృష్టికి కళ్లకుర్చి వ్యవహారం

ఈపీఎస్ నిర్ణయం ● త్వరలో ఢిల్లీ పయనం



ప్యారీస్, జూలై 2: కళ్లకుర్చిలో కల్తీ సారా తాగిన ఘటనలో 65 మందికి పైగా మృతిచెందగా, 100 మంది చికిత్స పొందుతున్న వ్యవహారంలో సీబీఐ విచారణ కోరుతూ రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలిసి వినతిపత్రం సమర్పించాలని మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి నిర్ణయించారు. త్వరలో పార్టీకి చెందిన 61 మంది ఎమ్మెల్యేలతో ఢిల్లీకి వెళ్తారని అన్నాడీఎంకే వర్గాలు తెలిపాయి. యేడాది క్రితం చెంగల్పట్టు జిల్లా మధురాంతకం, విల్లుపురం జిల్లా మరక్కాణం ప్రాంతాల్లో చట్టవిరుద్ధంగా విక్రయించిన కల్తీ సారా తాగి 23 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ సంఘటనలకు సంబంధించి 8 మందిని అరెస్ట్ చేశారు. చెంగల్పట్టు, విల్లుపురం డీఎస్పీలు, పోలీసులను సస్పెండ్ చేశారు. మృతుల కుటుంబీకులకు సీఎం స్టాలిన్ రూ.10 లక్షల పరిహారం అందజేశారు. ఈ నేపథ్యంలో, తాజాగా కళ్లకుర్చిలో కల్తీ సారా తాగి 65 మంది మృతిచెందగా, కొంతమంది బాధితులు చూపుకోల్పోయారు. కళ్లకుర్చి కల్తీ సారా దుర్ఘటనపై రాష్ట్రప్రభుత్వం సీబీసీఐడీ విచారణకు ఆదేశించింది. అయితే సీబీసీఐడీ విచారణకు అన్నాడీఎంకే, డీఎండీకే తదితర విపక్షాలు అభ్యంతరం తెలిపి వాస్తవాలు వెలుగులోకి రావాలంటేకేసును సీబీఐ విచారణకు అప్పగించాలని పట్టుబట్టాయి. అంతేకాకుండా, గత వారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో కళ్లకుర్చి దుర్ఘటన వ్యవహారంపై ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే ఎమ్మెల్యేలు ఆందోళనలకు దిగి, శాసనసభ సమావేశాలను పూర్తిగా బహిష్కరించారు. అలాగే, రాష్ట్ర గవర్నర్ ఆర్ ఎన్ రవిని పార్టీ ఎమ్మెల్యేలతోపాటు ఈపీఎస్ కలిసి సీబీఐ విచారణకు ఆదేశించాలని కోరుతూ వినతిపత్రం కూడా సమర్పించారు. ఇదే రీతిలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత కూడా గవర్నర్‌ను వేర్వేరుగా కలుసుకుని సీబీఐ విచారణ కోరుతూ వినతిపత్రం సమర్పించారు. అయినప్పటికీ, కళ్లకుర్చి కల్తీ సారా కేసు విచారణను సీబీఐకి అప్పగించేందుకు రాష్ట్రప్రభుత్వం ముందుకు రాలేదు. ఈ పరిస్థితులలో ఢిల్లీ వెళ్లి రాష్ట్రపతిని కలిసి వినతిపత్రం సమర్పించాలని ఈపీఎస్ నిర్ణయించారు. రాష్ట్రపతి భవన్ నుంచి అపాయింట్‌మెంట్ లభించగానే ఈపీఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలతో హస్తినకు పయనమవుతారని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

తూత్తుకుడి కాల్పులకు బాధ్యులైన అధికారులపై హత్యకేసు

● ప్రభుత్వానికి హైకోర్టు సలహా



ప్యారీస్, జూలై 2: తూత్తుకుడి కాల్పుల ఘటనకు బాధ్యులైన అధికారులపై హత్యా కేసు నమోదుచేయాలని రాష్ట్రప్రభుత్వానికి మద్రాసు హైకోర్టు సలహా ఇచ్చింది. తూత్తుకుడిలో పర్యావరణ పరిరక్షణకు వ్యతిరేకంగా పని చేస్తున్న స్టెరిలైట్ కర్మాగారాన్ని శాశ్వతంగా మూసివేయాలని కోరుతూ 2018వ సంవత్సరంలో స్థానికులు ఆందోళన చేపట్టారు. అనుమతి లేకుండా రోడ్డెక్కిన ఆందోళనకారులను ఆ ప్రాంతం నుంచి వెళ్లగొట్టేందుకు పోలీసులు జరిపిన కాల్పుల్లో 13 మంది మృతిచెందారు. ఈ ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ సుమోటోగా కేసు విచారణ చేపట్టింది. అనంతరం రాష్ట్రప్రభుత్వం దాఖలుచేసిన నివేదిక పరిశీలించి ఈ కేసుకు ముక్తాయింపు పలికింది. రాష్ట్రప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ మదురైకి చెందిన న్యాయవాది హెన్నీదిబోస్ మద్రాసు హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌పై న్యాయమూర్తులు ఎస్ఎస్ సుందర్, ఎస్.సెంథిల్‌కుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ జరుపుతోంది. ఈ కేసు సోమవారం మళ్లీ ఈ డివిజన్ బెంచ్ ముందుకు విచారణకు రాగా, రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, జస్టిస్ అరుణా జగదీశన్ కమిషన్ విచారణ జరిపిన ఈ కేసును మళ్లీ విచారణ జరపడం సాధ్యం కాదని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు వాదించారు. ఇందుకు అభ్యంతరం తెలిపిన పిటిషనర్ కాల్పుల్లో 13 మంది మరణించడానికి కారకులైన 17 మంది అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వాదించారు. సీబీఐ తరఫు న్యాయవాది వాదిస్తూ, ఈ ఘటనకు సంబంధించి మదురై ప్రత్యేక కోర్టులో తుది నివేదిక దాఖలుచేశామని, ఈ కేసు వేసిన పిటిషనర్‌కు ఎలాంటి అర్హత లేదని అభ్యంతరం తెలుపుతూ వాదించారు. దాంతో జోక్యం కలుగజేసుకున్న న్యాయమూర్తులు, హక్కుల కోసం రోడ్డెక్కిన ప్రజలపై తుపాకితో కాల్పులు జరపాలని ఉత్తర్వులు జారీచేసిందెవ్వరు? 13 మంది మరణాలకు బాధ్యత ఎవరు? అని ప్రశ్నించి, ఈ కేసులో పిటిషనర్‌కు వివరణ ఇవ్వాలని ఆదేశిస్తూ తదుపరి విచారణ ఈ నెల 15వ తేదీకి వాయిదావేశారు.

సమాచార దర్శిని

ఆర్ట్స్ కళాశాలల్లో దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగింపు

పెరంబూర్, జూలై 2: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో అడ్మిషన్లకు సంబంధించి దరఖాస్తు గడువు పొడిగించారు. ఈ మేరకు ఉన్నత విద్యాశాఖ జారీచేసిన ఉత్వర్వుల్లో, బుధవారం నుంచి 5వ తేది వరకు టీఎన్‌జీఏఎస్‌ఏ అనే వెబ్‌సైట్‌లో విద్యార్థులు దరఖాస్తులు సమర్పించాలని, 8వ తేది నుంచి అడ్మిషన్లు చేపట్టాలని కళాశాలలకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఒక కోర్సులో అడ్మిషన్ పొందిన విద్యార్థులు మరో కోర్సులో చేరాలని ఆసక్తి చూపితే, ఆ కోర్సులో ఖాళీలు పరిశీలించి వారికి అడ్మిషన్ కల్పించాలి. అలాగే, సీటు పొంది కళాశాలల్లో చేరకుంటే ఆ సీట్లు కూడా భర్తీచేయాలని ఉన్నత విద్యా శాఖ ఉత్తర్వుల్లో పేర్కొంది. రాష్ట్రంలోని 164 ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలల్లో 2వ విడత అడ్మిషన్ కౌన్సెలింగ్ పూర్తికాగా, 63 శాతం సీట్లు భర్తీ అయినట్లు తెలిసింది.

నేటినుంచి వైగై డ్యాం సాగునీరు విడుదల

పెరంబూర్, జూలై 2: వైగై డ్యాం నుంచి సాగునీరు విడుదల చేయాలని రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు సచివాలయం మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో, బుధవారం నుంచి 45 రోజులు పూర్తిగా, 75 రోజులు విడతల వారీగా నీటిని విడుదల చేయనున్నారు. ఈ నీటితో దిండుగల్ జిల్లా నీలకోట పరిధిలో 1,797 ఎకరాలు, మదురై వడపట్టి పరిధిలో 16,452 ఎకరాలు, మదురై నార్త్ పరిధిలో 26,792 ఎకరాలు మొత్తం 45,051 ఎకరాలకు సాగునీరు లభిస్తుందని ప్రభుత్వం తెలియజేసింది.

25 వేల మంది పాలిటెక్నిక్ విద్యార్థులకు ఉపాధి

ఐసిఎఫ్, జూలై 2: 'నాన్ ముదల్‌వన్' పథకంలో పాలిటెక్నిక్ విద్యార్థులు 25 వేల మందికి ఉపాధి కల్పించినట్లు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సోషల్ మీడియాలో పేర్కొన్నారు. ద్రావిడ మోడల్ ప్రభుత్వం యువత కలలను సాకారం చేస్తుందని తెలిపారు. ప్రభుత్వ అవకాశాలు అందిపుచ్చుకుని తమ తమ శాఖల్లో రాణించాలని ఆకాంక్షించారు.

పోలీస్‌స్టేషన్లలో సీసీ కెమెరాలు

ఐసిఎఫ్, జూలై 2: రాష్ట్రంలోని పోలీస్‌స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 1,500లకు పైగా పోలీస్‌స్టేషన్లలో సీసీ కెమెరాలు ఏర్పాటుచేసి వాటి పుటేజీలు భద్రపరుస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎన్‌సీసీ ప్రధాన అధికారిగా రాఘవ్

ఐసిఎఫ్, జూలై 2: జాతీయ విద్యార్థి దళం (ఎన్‌సీసీ) ప్రధాన అధికారిగా ఎస్.రాఘవ్ బాధ్యతలు స్వీకరించారు. తమిళనాడు, పుదుచ్చేరి, అండమాన్-నికోబార్ ప్రాంతీయ ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఉప డైరెక్టర్ జనరల్‌గా ఉన్న అతుల్ కుమార్ రస్తోగి ఆదివారం పదవీవిరమణ పొందగా, ఆయన స్థానంలో రాఘవ్ నియమితులయ్యారు.

నేడు బీమా ఏజెంట్లకు ఇంటర్వ్యూలు

ఐసిఎఫ్, జూలై 2: స్థానిక టి.నగర్‌లో ఉన్న ప్రధాన తపాలా కార్యాలయంలో జీవిత బీమా ఏజెంట్ల పోస్టులకు బుధవారం ఇంటర్వ్యూలు జరుగనున్నాయి. ఔత్సాహికులు ఇంటర్వ్యూలో పాల్గొనవచ్చు. తపాలా జీవిత బీమా, గ్రామీణ తపాలా జీవిత బీమా విక్రయాల కోసం కొత్త ఏజెంట్లను నియమించనున్నారు. చెన్నైకి చెందిన టెన్త్ ఉత్తీర్ణులైన వారు హాజరుకావచ్చు. ఇంటర్వ్యూ అనంతరం ఎంపికైన వారు రూ.5,000లకు జాతీయ పొదుపు పత్రం (ఎన్ఎస్‌సీ), కిసాన్ వికాస్ పత్రం (కేవీపీ) నగదు భద్రతా పత్రంగా అందజేయాల్సి ఉంటుంది. ఎంపికైన వారికి పాలసీ ప్రిమియం ఆధారంగా ప్రోత్సాహక భత్యం అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ప్రత్యేక రైళ్ల సేవల పొడిగింపు

పెరంబూర్, జూలై 2: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా రెండు ప్రత్యేక రైళ్ల సర్వీసులు పొడిగించినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

- నెం.06070 తిరునల్వేలి-చెన్నై ఎగ్మూర్ వారాంతపు ప్రత్యేక రైలు (గురువారం) ఈ నెల 4 నుంచి 18వ తేది వరకు (3 సర్వీసులు) పొడిగించారు. అలాగే, నెం.06069 చెన్నై ఎగ్మూర్-తిరునల్వేలి వారాంతపు ప్రత్యేక రైలు (శుక్రవారం) ఈ నెల 5 నుంచి 19వ తేది వరకు (3 సర్వీసులు) పొడిగించారు.
- నెం.06030 తిరునల్వేలి-మేట్టుపాళయం వారాంతపు ప్రత్యేక రైలు (ఆదివారం) ఈ నెల 7 నుంచి 28 తేది వరకు (4 సర్వీసులు) పొడిగించారు. అలాగే, నెం.06029 మేట్టుపాళయం-తిరునల్వేలి వారాంతపు ప్రత్యేక రైలు (సోమవారం) ఈ నెల 8 నుంచి 29వ తేది వరకు (4 సర్వీసులు) పొడిగించారు. ఈ ప్రత్యేక రైళ్ల రిజర్వేషన్ ప్రారంభమైనట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

326 మంది హజ్ యాత్రికులతో వచ్చిన విమానం

ఐసిఎఫ్, జూలై 2: రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లిన మొదటి విమానం 326 మంది ప్రయాణికులతో నగరానికి చేరుకుంది. వారికి విమానాశ్రయంలో మంత్రి సెంజి మస్తాన్, కమిటీ నిర్వాహకులు స్వాగతం పలికారు. హజ్ యాత్ర కోసం మొదటి విమానం మే 25వ తేది వెళ్లింది. యాత్ర ముగించుకొని సౌదీ అరేబియా మదీనా నగరం నుంచి 170 మంది మహిళలు సహా 326 మంది యాత్రికులతో బయల్దేరిన ప్రత్యేక విమానం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు అంతర్జాతీయ విమానాశ్రయానికి వచ్చి చేరింది.

ఐస్‌క్రీమ్ హోల్‌సేల్ విక్రయాల్లో ఆవిన్

ఐసిఎఫ్, జూలై 2: వివాహం సహా విశేష కార్యక్రమాలకు ఐస్‌క్రీమ్ హోల్‌సేల్‌గా విక్రయించేందుకు ఆవిన్ సంస్థ చర్యలు చేపట్టింది. ప్రస్తుతం ఈ సంస్థ ప్రతిరోజు పాలతో పాటు 230 రకాల పాల పదార్థాలు విక్రయిస్తోంది. వాటిలో ఆవిన్ నెయ్యి, పాలకోవా, ఐస్‌క్రీమ్, కుల్ఫీ వంటి వాటికి వినియోగదారుల ఆదరణ లభిస్తోంది. ప్రతి సంవత్సరం 20 శాతం విక్రయాలు పెంచేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో, ఏడాది పొడవునా వివాహం, బర్త్‌డే, ఇతర శుభకార్యాలకు ఐస్‌క్రీమ్‌లు హోల్‌సేల్‌గా విక్రయించేందుకు ఆవిన్ సంస్థ నిర్ణయించింది. హోల్‌సేల్‌గా కొనుగోలు చేసే వారికి ప్రత్యేక రాయితీ ఇస్తామని అధికారులు తెలిపారు.

శ్రీలంక నావికాదళం అరెస్టులకు నిరసనగా...

రామేశ్వరం జాలర్ల నిరవధిక సమ్మె

- విడిపించమంటూ కేంద్ర మంత్రికి సీఎం లేఖ

ప్యారీస్, జూలై 2: బంగాళాఖాతంలో చేపల వేటకు వెళ్లిన రామేశ్వరానికి చెందిన 25 మంది జాలర్ల అరెస్ట్‌ను ఖండిస్తూ శ్రీలంక కోస్ట్‌గార్డ్‌కు వ్యతిరేకంగా మంగళవారం రామేశ్వరం జాలర్లు ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించారు. ఈ నెల 5వ తేదీ రామనాథపురంలో రైల్‌రోకో చేపట్టనున్నట్లు జాలర్లు ప్రకటించారు. రామేశ్వరం సమీపంలోని తంగచ్చిమఠం, పాంబన్ తదితర ప్రాంతాలకు చెందిన 2,500 మందికి పైగా జాలర్లు 400లకు పైగా మర బోట్లల్లో ఆదివారం పాక్ జలసంధి, మన్నార్ వలైగుడ ప్రాంతాల్లోని సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. వారు రాత్రి సమయంలో చేపలు పడుతుండగా, అటువైపు వచ్చిన శ్రీలంక కోస్ట్‌గార్డ్ బలగాలు తమిళ జాలర్లపై దాడికి పాల్పడడంతో పాటు 25 మంది జాలర్లను అరెస్ట్ చేసి శ్రీలంకకు తరలించారు. అరెస్టయిన తమిళ జాలర్లను, వారి పడవలను కాంగేశన్ హార్బర్ కోస్ట్‌గార్డ్ కార్యాలయానికి తీసుకెళ్లారు. దీంతో వేటకు వెళ్లిన భారతీయ జాలర్లు మధ్యలోనే తీరానికి తిరుగుముఖం పట్టారు. ప్రస్తుతం శ్రీలంకలో బందీలుగా ఉన్న 21 మంది జాలర్లను విడిపించాలని డిమాండ్ చేస్తూ సోమవారం పాంబన్ హైరోడ్డులో వందలాది మంది జాలర్లు బైఠాయించిన ఆందోళన చేపట్టడంతో ఆ మార్గంలో ట్రాఫిక్ స్తంభించింది. అదే విధంగా పాంబన్ వద్ద సముద్రంలో దిగిన జాలర్లు శ్రీలంక కోస్ట్‌గార్డ్ దాష్టికాన్ని ఎండగడుతూ నినాదాలు చేశారు. ఆందోళనలో పాల్గొన్న జాలర్లు మాట్లాడుతూ... ఈ ఏడాది జనవరి నుంచి ఈరోజు వరకు భారతీయ జాలర్ల 32 పడవలను స్వాధీనం చేసుకొని 238 మంది జాలర్లను శ్రీలంక కోస్ట్‌గార్డ్ బలగాలు అరెస్ట్ చేయడం ఖండించదగ్గదన్నారు. చేపల వేటకు సముద్రంలోకి వెళ్లే తమకు భద్రత కల్పించేలా కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. ఈ నేపథ్యంలో, శ్రీలంక కోస్ట్‌గార్డ్ బలగాల వైఖరిని ఖండిస్తూ రామనాథపురం జిల్లా నాటు పడవల జాలర్లు మంగళవారం నుంచి నిరవధిక సమ్మె బాటపట్టారు.



కేంద్రమంత్రికి స్టాలిన్ లేఖ...

శ్రీలంక నావికదళం అక్రమంగా అరెస్టు చేసి తరించిన 25 మంది తమిళ జాలర్లను, వారి పడవలను తక్షణమే విడిపించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతూ కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ జయశంకర్‌కు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ లేఖ రాశారు. సోమవారం వేకువజాము పాక్‌జలసంధి సమీపంలో తమిళ జాలర్లు 25 మంది చేపలు పడుతుండగా అక్కడికి చేరుకున్న శ్రీలంక నావికాదళం దాడి జరిపి అక్రమంగా నిర్బంధించి, రెండు మరపడవలతోపాటు తరలించుకెళ్లారని ఆరోపించారు. ప్రస్తుతం శ్రీలంక నావికాదళం అక్రమంగా నిర్బంధించిన 25 మంది జాలర్లను త్వరగా విడిపించేందుకు చర్యలు చేపట్టాలని స్టాలిన్ ఆ లేఖలో డిమాండ్ చేశారు.

మాదకద్రవ్యాల విక్రయాల్లో గొడవలు

- ఇద్దరు యువకుల దారుణహత్య
- నలుగురి కోసం గాలింపు

అడయార్, జూలై 2: స్థానిక తాంబరంలో మాదకద్రవ్యాల విక్రయాల్లో ఏర్పడిన గొడవలు ఇద్దరు యువకుల హత్యకు దారితీశాయి. ఈ హత్యలకు పాల్పడిన ఒక డ్రగ్ వ్యాపారి సహా అతని ముగ్గురు స్నేహితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. మంగళవారం వెలుగులోకి వచ్చిన ఈ వివరాలను పరిశీలిస్తే, స్థానిక పెరుంగళత్తూరు ప్రాంతానికి చెందిన సోను అలియాస్ గోపాలకృష్ణన్ అనే వ్యక్తి మాదకద్రవ్యాలను దొంగచాటుగా విక్రయిస్తున్నాడు. ఇతడి వద్ద అదే ప్రాంతానికి చెందిన అన్నామలై (23), తమిళరసన్ (23) అనే ఇద్దరు యువకులు డ్రగ్స్ కొనుగోలు చేసేవారు. కాలక్రమంలో సోను డ్రగ్స్ కొనే ప్రాంతాన్ని తెలుసుకున్న ఈ ఇద్దరు యువకులు నేరుగా అక్కడ నుంచే మాదకద్రవ్యాలను కొనుగోలు చేసి వ్యాపారం చేయసాగారు. ఈ క్రమంలో సోను కస్టమర్లకు కూడా వీరు డ్రగ్స్ సరఫరా చేసేవారు. ఈ విషయం తెలుసుకున్న సోను.. వారితో గొడవపడ్డాడు. అయినప్పటికీ ఆ యువకులు తమ వైఖరిని మార్చుకోకపోవడంతో వారిద్దరిని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో తన స్నేహితుల సాయంతో ఒక ఆటోలో అన్నామలై, తమిళరసన్‌లను కిడ్నాప్ చేసిన సోను.. తాంబరం కార్పొరేషన్ వెనుకవైపున ఉన్న గోదాము వద్దకు తీసుకెళ్ళారు. అక్కడ అన్నామలై, తమిళరసన్‌లను గొంతుకోసి హత్య చేశారు. ఈ విషయాన్ని ఆటో డ్రైవర్ హరి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. దీంతో పీర్కాంకరణి పోలసులు ఘటనా స్థలానికి వెళ్ళి యువకుల మృతదేహాలను స్వాధీనం చేసుకుని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘాతుకానికి పాల్పడిన సోను, అతని ముగ్గురు స్నేహితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

బుద్ధిమాంధ్యం చిన్నారులకు ప్రత్యేక వైద్య శిబిరం



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, జూలై 2: జిల్లా రెవెన్యూ శాఖ సమూహ భద్రతా పథకం కింద 18 ఏళ్లలోపున్న దివ్యాంగులు, బుద్ధిమాంధ్యం కలిగిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి గుర్తింపుకార్డులు అందించేలా ప్రత్యేక వైద్య శిబిరం మంగళవారం జరిగింది. ఈ శిబిరాన్ని కలెక్టర్ సుబ్బులక్ష్మి ప్రారంభించారు. శిబిరంలో సమూహ భద్రతా పథక సబ్ కలెక్టర్ కలియమూర్తి, ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ బాలచంద్రన్, జిల్లా దివ్యాంగుల సంక్షేమ అధికారి శరవణన్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బస్సు ప్రయాణ పథకానికి 13 మంది ఎంపిక

ఐసిఎఫ్, జూలై 2: ప్రభుత్వ బస్సుల్లో ప్రయాణ బహుమతి పథకంలో 13 మంది ఎంపికయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థల బస్సుల్లో ప్రయాణించేందుకు వెబ్‌సైట్, యాప్ ద్వారా టిక్కెట్లు బుకింగ్ చేసుకోనే సౌకర్యం కల్పించారు. వారాంతపు సెలవు రోజులు, పండుగ రోజులు మినహాయించి ఇతర రోజుల్లో టిక్కెట్లు బుకింగ్ చేసుకొని ప్రయాణించడాన్ని ప్రోత్సహించేలా ప్రతినెలా డ్రా విధానంలో ముగ్గురు ప్రయాణికులకు తలా రూ.10,000 నగదు బహుమతి అందజేసే పథకాన్ని జనవరిలో ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ఎక్కువ మంది లబ్ధిపొందేలా డ్రా నిర్వహించి 13 మందిని ఎంపిక చేసి మొదటి ముగ్గురికి తలా రూ.10 వేలు, పది మందికి తలా రూ.2 వేలు నగదు బహుమతి అందజేస్తున్నారు. ఆ ప్రకారం, జూన్ నెలకు 13 మందిని అధికారులు ఎంపిక చేశారు. త్వరలో వీరికి నగదు బహుమతి అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వాస్పత్రులకు రూ.350 కోట్ల విడుదల

ఐసిఎఫ్, జూలై 2: ప్రభుత్వాసుపత్రులకు రూ.350 కోట్ల నిధులను తమిళనాడు డాక్టర్ ఎంజీఆర్ వైద్య విశ్వవిద్యాలయం అందజేసింది. గిండిలో ఉన్న ఈ వర్సిటీలో జాతీయ డాక్టర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ వైద్యులకు పురస్కారం అందజేసే కార్యక్రమం సోమవారం జరిగింది. 96 మంది ప్రభుత్వ, 9 మంది ప్రైవేటు వైద్యులకు అవార్డులు అందజేశారు. రాబోయే కాలాల్లో శాఖల వారీగా 10 మంది వైద్యులు, 10 మంది ప్రైవేటు వైద్యులు కలిపి ఏడాదికి 50 మంది ఉత్తమ వైద్యులను ఎంపిక చేసి సన్మానించనున్నట్లు తెలిపారు. తంజావూరు, గిండిలో ఏర్పాటు కానున్న పిల్లల ఉన్నత చికిత్సకు రూ.250 కోట్లు, దివ్యాంగుల ప్రత్యేక ఆస్పత్రికి రూ.50 కోట్లు, వైద్యకళాశాల విద్యార్థుల తరగతి గదుల అభివృద్ధికి రూ.50 కోట్లు అందజేసినట్లు వర్సిటీ వీసీ తెలిపారు.

నందనంలో 30 మీటర్ల లోతున మెట్రో రైల్వేస్టేషన్

ఐసిఎఫ్, జూలై 2: స్థానిక నందనంలో రెండో మెట్రో రైల్వేస్టేషన్ 30 మీటర్ల లోతులో ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో రెండో విడతగా 116 కి.మీ మేర మూడు మార్గాల్లో మెట్రోరైలు పనులు జరుగుతున్నాయి. ఈ రైల్వేస్టేషన్లు ప్రధాన బస్ టెర్మినళ్లు, రైల్వేస్టేషన్లు, ఇదివరకే ఉన్న మెట్రో రైల్వేస్టేషన్లతో అనుసంధానం చేయనున్నారు. తొలివిడత మెట్రో పథకం కింద ప్రస్తుతమున్న మెట్రో రైళ్లు నడిచే ఆలందూర్, నందనం, థౌజండ్ లైట్స్, కీల్పాక్కం, తిరుమంగళం, వడపళని స్టేషన్లు రెండో విడత మెట్రోరైళ్లకు అనుసంధానం చేస్తున్నారు. ఆ ప్రకారం, ఇదివరకే సౌరంగమార్గంలో వెళ్లే మెట్రోరైలు మార్గం కింద నందనంలో 30 మీటర్ల లోతున రైల్వేస్టేషన్ నిర్మించనున్నారు. ఈ స్టేషన్ మూడు లిఫ్టులు, 12 ఎస్కలేటర్లతో పనిచేయనుందని, ప్రయాణికుల భద్రత, వెలుతురు, గాలి వసతి వంటి సౌకర్యాలతో 2026లో అందుబాటులోకి వస్తుందని అధికారులు తెలిపారు.

లేఖ రాసిన వింత దొంగ

- నెలలో అన్నీ తిరిగి ఇచ్చేస్తానంటూ చోరీ

అడయార్, జూలై 2: తూత్తుక్కుడి జిల్లాలో రిటైర్డ్ టీచర్ దంపతుల ఇంటిలో చోరీ జరిగింది. ఈ చోరీకి పాల్పడిన దొంగ.. ఇంటిలోని బంగారం నగలు, డబ్బులు చోరీ చేస్తూ, తన భార్య అనారోగ్యంగా ఉందని, అందువల్ల చోరీ చేసిన వస్తువులను ఒక నెలలో తిరిగి ఇచ్చేస్తానంటూ ఒక లేఖ రాసిపెట్టిన ఆసక్తికర సంఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. జిల్లాలోని మంజానపురంకు చెందిన చిత్తిరై సెల్వన్(79), ఈయనభార్య ఉపాధ్యాయులుగా పనిచేసి రిటైర్డ్ అయ్యారు. వీరికి నలుగురు పిల్లలు. చెన్నైలో ఒక కుమార్తెను చూసేందుకు ఈ నెల 17వ తేదీ భార్యతో కలిసి చిత్తిరై సెల్వన్ నగరానికి వచ్చారు. ఆ సమయంలో ఇంటిని చూసుకునేందుకు సెల్వి అనే మహిళను నియమించారు. సోమవారం సాయంత్రం ఆమె ఇంటి వాకిలిని శుభ్రం చేసేందుకు రాగా, ఇంటి తలుపులు తెరిచివుండటాన్ని గమనించి, వెంటనే ఇంటి యజమానికి సమాచారం అందించారు. ఆ వెంటనే చిత్తిరై సెల్వన్ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా, వారు ఇంటికి వెళ్ళి పరిశీలించారు. బీరువాలో ఉన్న రూ.60 వేల నగదు, బంగారు నగలను చోరీకి గురైనట్టు గుర్తించి, కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు. అయితే, ఈ చోరీకి పాల్పడిన దొంగ.. ఒక లేఖను రాసి పెట్టాడు. అందులో 'నన్ను క్షమించండి. నా భార్య ఆనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్య ఖర్చుల కోసమే ఈ చోరీ చేస్తున్నాను. ఒక నెలలో తిరిగి నగలు తెచ్చి ఇచ్చేస్తాను' అని రాసిపెట్టారు. ఈ లేఖను చూసిన పోలీసులు సైతం ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ నవ్వుకున్నారు.

ప్రభుత్వ పాఠశాలలో చేరితే నెలకు రూ.300

- ఉపాధ్యాయుడి వినూత్న ఆలోచన

ఐసిఎఫ్, జూలై 2: ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థులకు ప్రతినెలా వారి బ్యాంక్ ఖాతాల్లో రూ.300 జమచేయనున్నట్లు ప్రకటిస్తూ ఉపాధ్యాయులు చర్యలు చేపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచిత విద్యతో పాటు యూనిఫాం, పుస్తకాలు, ఉపకారవేతనం, షూ, సైకిల్, మధ్యాహ్న భోజనం, ల్యాప్‌టాప్ తదితరాలు ఉచితంగా అందజేసినప్పటికీ అడ్మిషన్లు తగ్గుతున్నాయి. తేని జిల్లా కంబం సమీపంలోని రాయప్పన్‌పట్టి, అనైపట్టి, కోట్టాపురం గ్రామాల్లోని కళ్లర్ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. ఇటీవల అనైపట్టి పాఠశాలకు బదిలీపై వచ్చిన ఉపాధ్యాయుడు సుందర్, విద్యార్థులు లేకపోవడాన్ని గుర్తించి దిగ్భ్రాంతి చెందారు. ఎలాగైనా విద్యార్థులను పాఠశాలలో చేర్పించాలన్న ఉద్దేశంతో పాఠశాలలో చేరే విద్యార్థులకు ప్రతినెలా రూ.300 ఇస్తామని, పాఠశాలకు వచ్చేందుకు ఆటో ఏర్పాటుచేస్తామనే హామీలతో కరపత్రాలు ఇంటింటా పంపిణీ చేశారు. ఈ ప్రకటనతో విద్యార్థులను పాఠశాలలో చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకొస్తున్నట్లు ఉపాధ్యాయుడు సుందర్ తెలిపారు.

మదురై, కోవై మెట్రోరైలు పథకం....

నేడు ఆసియా బ్యాంక్ ప్రతినిధుల పరిశీలన

ప్యారీస్, జూలై 2: మదురై-కోవై మెట్రోరైలు పథకాలకు రుణం పంపిణీ చేయనున్న ఆసియా పెట్టుబడుల బ్యాంక్ ప్రతినిధులు బుధవారం పరిశీలించనున్నారు. కార్పొరేషన్‌గా అభివృద్ధి చెందిన కోవై మహానగరంలో అవినాశి రోడ్డు-సత్యమంగళం రోడ్లను కలుపుతూ రూ.10,740 కోట్లతో మెట్రోరైలు పథకాన్ని రూపొందించారు. అలాగే, మదురై కార్పొరేషన్ పరిధిలోని తిరుమంగళం-వత్తకడై ప్రాంతాలు కలిపేలా రూ.11,368 కోట్లతో సమగ్ర ప్రణాళిక రూపొందించారు. ఈ రెండు మెగా పథకాలకు సంబంధించిన నిధులను కేంద్రప్రభుత్వం నుంచి మూలధనంగా పొందేందుకు నివేదిక పంపించారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ పరిశీలనలో ఉన్న ఈ పథకాలకు అనుమతులు మంజూరైన వెంటనే ఈ రెండు నగరాల్లో మెట్రోరైలు పథకం పనులు ప్రారంభించనున్నట్లు రాష్ట్రప్రభుత్వం తన వార్షిక బడ్జెట్‌లో తెలిపింది. ఈ నేపథ్యంలో, మదురై, కోవై మెట్రోరైలు పథకాలను బుధ, గురువారాల్లో ఆసియా పెట్టుబడుల బ్యాంక్ ప్రతినిధుల బృందం పరిశీలించనుంది. ఇందుకోసం రాష్ట్రప్రభుత్వం అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసింది.

విక్రవాండిలో వృద్ధుల పోలింగ్ ప్రారంభం

అడయార్, జూలై 2: విల్లుపురం జిల్లాలోని విక్రవాండి అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నికకు సంబంధించి ఈ నెల 10వ తేదీ పోలింగ్ జరుగనుంది. ఈ ప్రక్రియలో భాగంగా వృద్ధులు, సీనియర్ సిటజన్లు, దివ్యాంగుల తపాలా పోలింగ్ ప్రారంభమైంది. ఈ పోలింగ్‌ను జిల్లా కలెక్టర్ పళని, ఎన్నికల రిటర్నింగ్ అధికారి చంద్రశేఖర్ మంగళవారం ప్రారంభించారు. పోలింగ్ సిబ్బంది బ్యాలెట్ బాక్సులతో వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్ళి వారి ఓట్లను సేకరిస్తున్నారు. డీఎంకేకు చెందిన సిట్టింగ్ ఎమ్మెల్యే పుహళేంది హఠాన్మరణంలో ఈ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించాల్సి వచ్చింది. ఈ ఎన్నికల్లో 29 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. నియోజకవర్గంలో మొత్తం 237031మంది ఓటర్లుండగా, వీరిలో 116962 మంది పురుషులు, 120040 మంది మహిళలు, 29 మంది థర్డ్‌జెండర్ ఓటర్లు ఉన్నారు.

50 మందితో వీధి శునకాల గణన

ఐసిఎఫ్, జూలై 2: నగరంలో వీధి శునకాల గణనకు 50 మందిని నియమించినట్లు కార్పొరేషన్ అధికారులు తెలిపారు. నగరంలో పెంపుడు కుక్కలు, వీధి కుక్కల దాడుల్లో పలువురు తీవ్రంగా గాయపడడంతో పాటు కొందరు మృతిచెందుతున్నారని, దీనిని నియంత్రించేందుకు కార్పొరేషన్ చర్యలు చేపట్టిందన్నారు. వీధి శునకాలకు రాబిస్ నిరోధక టీకాలు వేయడంతో పాటు జాతి నియంత్రణ శస్త్రచికిత్స కూడా చేస్తున్నామన్నారు. మూడేళ్లకు ఒకసారి గణన చేపట్టి వాటికి చికిత్స అందిస్తున్నామన్నారు. 2018లో జరిగిన గణనలో నగరంలో 53,366 వీధి శునకాలున్నాయని, అనంతరం కరోనా కారణంగా గణన చేపట్టలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో, మరో రెండు వారాల్లో 50 మంది సిబ్బందితో శునకాల గణన చేపట్టనున్నట్లు వెల్లడించారు.

కోయంబేడు ప్రాంతంలో కుక్కలను బంధించాలంటూ పిటిషన్

పెరంబూర్, జూలై 2:స్థానిక కోయంబేడు మెట్రోజోన్‌లోని అపార్ట్‌మెంట్ పరిసరాల్లో అధికమైన వీధికుక్కలను బంధించాలంటూ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆ ప్రాంతానికి చెందిన షబీనా ఫాతిమా దాఖలుచేసిన పిటిషన్‌లో... కార్పొరేషన్ ఉద్యోగులు కుక్కలను బంధించేందుకు వచ్చిన సమయంలో కొందరు సామాజిక కార్యకర్తలమంటూ వారిని అడ్డుకుంటున్నారని, వారిని ప్రశ్నిస్తే కుక్కలను హింసిస్తున్నారంటూ కేసు వేస్తామని బెదిరించినట్లు పిటిషన్‌లో పేర్కొన్నారు.వాక్సిన్‌వేయని వీధికుక్కలను బంధించేలా ఉత్తర్వులివ్వాలని షబీనా ఫాతిమా పిటిషన్‌లో కోరారు.ఈ విషయమై హైకోర్టు ఉత్తర్వులతో, వీధికుక్కలను బంధించే విషయం పరిశీలిస్తున్న చెన్నై కార్పొరేషన్ అఫిడవిట్ దాఖలుచేసింది.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

ఐసిఎఫ్, జూలై 2: విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. **అంబత్తూర్:** అన్నై అభిరామినగర్, కోలడి రోడ్డు, అన్బు నగర్, వీజీఎన్ అపార్ట్‌మెంట్స్, మహాలక్ష్మి నగర్, దేవి కరుమారియమ్మన్ నగర్, తేరడి వీధి, నొలంబూర్, కంబర్ రోడ్డు 1,2,3 బ్లాక్‌లు, మొగప్పేర్ వెస్ట్ మెయిన్ రోడ్డు, కంబర్ రోడ్డు, రెడ్డిపాళయం చుట్టుపక్కల ప్రాంతాలు. **పెరంబూర్:** సెంబియం, తండయార్‌పేట హైరోడ్డు, కావేరి రోడ్డు 1 నుంచి 8 వీధులు, పెరంబూర్ హైరోడ్డు, కొడుంగైయూర్, జీఎన్‌టీ రోడ్డు, గాంధీ నగర్, పెరంబూర్, బీబీ రోడ్డు, మాధవరం ఏరియా, మాదవరం హైరోడ్డు. **పల్లావరం:** కృష్ణా నగర్, రెట్టైపిళ్లయార్ ఆలయ వీధి, ఏలుమలై వీధి, హెచ్ఎల్ కాలని, సిగ్నల్ ఆఫీస్ రోడ్డు, పమ్మల్ నల్లతంబి రోడ్డు, దేవదాస్ వీధి, కక్కన్ వీధి, త్యాగరాజన్ వీధి, ప్రభాకరన్ వీధి, అన్నానగర్ 4వ మెయిన్ రోడ్డు, 7వ క్రాస్ వీధి, 3వ మెయిన్ రోడ్డు, గాంధీ రోడ్డు, రాధాకృష్ణన్ వీధి, లక్ష్మీనారాయణన్ నగర్ 2వ వీధి, నాంజీలాల్ వీధి.

గంజాయి విక్రయిస్తున్న 35 మంది అరెస్ట్

పెరంబూర్, జూలై 2: నగరంలోని వివిధ ప్రాంతాల్లో వారం రోజుల వ్యవధిలో గంజాయి, మత్తు పదార్థాలు విక్రయించిన 35 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. నగరంలో గంజాయి, మాదకద్రవ్యాల చెలామణి, వినియోగం, విక్రయాలను అడ్డుకొనేలా నగర పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ 'డ్రైవ్ అగెనెస్ట్ డ్రగ్స్' పేరుతో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. గత నెల 25 నుంచి ఈ నెల 1వ తేది వరకు నగరంలోని వివిధ ప్రాంతాల్లో చేపట్టిన తనిఖీల్లో గంజాయి, మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న ఘటనలపై 21 కేసులు నమోదుచేసి 35 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి 27.35 కిలోల గంజాయి, 6,622 నొప్పి నివారణ మాత్రలు, రూ.97,500 నగదు, రెండు సెల్‌ఫోన్లు, రెండు మోటారు సైకిళ్లు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీసు శాఖ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

డిపోలో ఉన్న ఏసీ బస్సులో మంటలు

పెరంబూర్, జూలై 2: స్థానిక అడయార్ డిపోలో ఉంచిన ఏసీ బస్సు నుంచి హఠాత్తుగా మంటలు చెలరేగాయి. మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (ఎంటీసీ) ఆధీనంలోని ఈ డిపోలో ఉంచిన ఏసీ బస్సు నుంచి మంగళవారం హఠాత్తుగా మంటలు వ్యాపించాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపుచేశారు. ఈ ప్రమాదంపై విచారణ చేపట్టినట్లు ఎంటీసీ అధికారులు తెలిపారు.

పానీ పూరి దుకాణాల్లో తనిఖీలు

పెరంబూర్, జూలై 2: పానీ పూరి దుకాణాల్లో తనిఖీలు చేపట్టాలని ఆహార శాఖ ఉత్తర్వులు జారీచేసింది. దుకాణాలు, తోపుడు బండ్లలో విక్రయిస్తున్న పానీ పూరీకి సంబంధించి పూరీ మసాలా, మసాలా నీరు తదితరాల నమూనా సేకరించి ల్యాబ్‌కు పంపాలని ఉత్తర్వులో పేర్కొంది. పానీ పూరీ మసాలా నీటిలో గ్రీన్ పిగ్మెంట్ కలుపుతున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో, రాష్ట్ర వ్యాప్తంగా పానీ పూరీ దుకాణాల్లో తనిఖీలు చేపట్టాలని ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీచేసింది.

యాసిడ్ లోడు మినీ లారీ బోల్తా



రోడ్డుపై పడిన యాసిడ్‌ను తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

వేలూరు, జూలై 2: యాసిడ్ లోడుతో వెళ్తున్న మినీ లారీ బోల్తాపడింది. కాట్పాడికి చెందిన మురుగన్ నడుపుతున్న లారీ, గోవిందపురం సమీపంలో వస్తుండగా హఠాత్తుగా వెనుక టైర్ పంచర్ కావడంతో అదుపుతప్పి రోడ్డు పక్కన బోల్తాపడింది. సమాచారం అందుకున్న టౌన్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకున్న రోడ్డుపై పడిన యాసిడ్‌పై నీరు పోసి తొలగించారు. ఈ కారణంగా కాట్పాడి-గుడియాత్తం మార్గంలో సుమారు గంట సేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

మధ్యాహ్న భోజనం తిన్న 25 మంది విద్యార్థులకు అస్వస్థత

పెరంబూర్, జూలై 2: కడలూరు జిల్లా చిదంబరం సమీపంలోని పాఠశాలలో మధ్యాహ్న భోజనం తిన్న 25 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వరకూర్‌పేట ప్రభుత్వ ఆదిద్రావిడ మాధ్యమిక పాఠశాలలో 200 మంది విద్యార్థులు చదువుతున్నారు. మంగళవారం మధ్యాహ్నం పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనం చేసిన 25 మంది విద్యార్థులు హఠాత్తుగా వాంతులు చేసుకుంటూ స్పృహతప్పి పడిపోయారు. సమాచారం అందుకున్న ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు అస్వస్థతకు గురైన విద్యార్థులను చిదరంబం ప్రభుత్వ కామరాజర్ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారనే సమాచారం అందుకున్న తల్లిదండ్రులు, బంధువులు ఆసుపత్రి వద్దకు చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. కాగా, మధ్యాహ్న భోజనంలో జెర్రి కనిపించిందనే విద్యార్థుల ఫిర్యాదుతో విచారణ చేపట్టినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు తెలిపారు.

తిరుత్తణి హుండీ లెక్కింపుల్లో రూ.1.15లక్షల చోరీ

- ఇద్దరు మహిళల అరెస్టు



అరెస్టయిన మహిళలు

చెన్నై, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుత్తణి ఆలయంలోని దేవర్‌మండపంలో హుండీ కానుకల లెక్కింపు నిర్వహించారు. ఈ లెక్కింపులో ఆలయ సిబ్బంది, తాత్కాలిక ఉద్యోగులు సహా వందమందికి పైగా పాల్గొని నగదు, నగలు లెక్కించారు. ఆ సందర్భంగా నగదును లెక్కిస్తున్న తేన్‌మొళి (35), వైజయంతి (44) అనే ఇద్దరు మహిళలు రూ.1.15 లక్షల నగదు అపహరించారు. ఆ ప్రాంతంని సీసీ కెమెరాల్లో ఆ ఇద్దరు మహిళలు చోరీచేస్తున్న దృశ్యం రికార్డయింది. దీంతో ఆలయ అధికారుల ఫిర్యాదు మేరకు ఇద్దరు మహిళలను పోలీసులు అరెస్టు చేసి, వారి నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు.

పాలారుపై చెక్‌డ్యాం నిర్మాణాన్ని అడ్డుకుంటాం

- మంత్రి దురైమురుగన్

పెరంబూర్, జూలై 2: పాలారు డ్యాంపై ఆంధ్ర ప్రభుత్వం చేపట్టనున్న చెక్‌డ్యాం నిర్మాణాన్ని అడ్డుకుంటామని జలవనరుల శాఖ మంత్రి దురైమురుగన్ తెలిపారు. విల్లుపురంలో మంగళవారం మంత్రి విలేఖరులతో మాట్లాడుతూ... పాలారు నదిపై చెక్‌డ్యాం నిర్మాణాలను ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపట్టినా, తాము అడ్డుకుంటామని తెలిపారు. నదీజలాల సమస్యను శాంతి చర్చల ద్వారా పరిష్కరించుకోవాలనే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. తమ అనుమతి లేకుండా ఆంధ్ర ప్రభుత్వం పాలారుపై చెక్‌డ్యాం నిర్మించే అవకాశమే లేదని మంత్రి స్పష్టం చేశారు.

రాష్ట్రంలో మళ్ళీ ఆలిండియా పర్మిట్ బస్సుల సంచారం

పెరంబూర్, జూలై 2: పొరుగు రాష్ట్రాల రిజిస్ట్రేషన్ కలిగిన ఆమ్నీ బస్సుల్లో ఆలిండియా పర్మిట్ కలిగిన వాహనాలకు రాష్ట్రంలో నిషేధం లేదని సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. పొరుగు రాష్ట్రాల రిజిస్ట్రేషన్ కలిగిన ఆమ్నీ బస్సులను రాష్ట్రంలో నిషేధం విధిస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రప్రభుత్వం, వందకు పైగా బస్సులను స్వాధీనం చేసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వులు వ్యతిరేకిస్తూ ఆమ్నీ బస్సుల యజమానుల సంఘం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. ఈ కేసు విచారించిన సుప్రీంకోర్టు, పొరుగు రాష్ట్రాల రిజిస్ట్రేషన్‌తో ఆలిండియా పర్మిట్ కలిగిన ఆమ్నీ బస్సులు తమిళనాడులో నడిపేందుకు సుప్రీంకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఈ ఉత్తర్వులతో, ఆలిండియా పర్మిట్ కలిగిన బస్సులను తమిళనాడు నుంచి పొరుగు రాష్ట్రాలకు మంగళవారం నుంచి నడుపనున్నామని, పొరుగు రాష్ట్రాల రిజిస్ట్రేషన్ కలిగిన బస్సులను తమిళనాడులో నడపడం లేదని ఆమ్నీ బస్సుల యజమానుల సంఘం ప్రకటించింది.


కులాంతర వివాహ జంటకు పోలీసు భద్రత

- మద్రాసు హైకోర్టు

ప్యారీస్, జూలై 2: కులాంతర వివాహం చేసుకున్న దంపతులకు పోలీసు భద్రత కల్పించాల్సిందిగా మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. తిరునల్వేలి సీపీఎం కార్యాలయంలో గత నెల వేర్వేరు కులాలకు చెందిన ప్రేమ జంటకు వివాహం జరిపించారు. దీనిపై ఆగ్రహించిన వధువు కుటుంబీకులు, బంధువులు సీపీఎం కార్యాలయంలో చొరబడి ఫర్నిచర్ ధ్వంసం చేశారు. ఈ నేపథ్యంలో, తమకు పోలీసు భద్రత కల్పించాలని కోరుతూ వధువు దాఖలుచేసిన పిటిషన్ మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి జయచంద్రన్ సమక్షంలో విచారణకు వచ్చింది. ఆ దంపతులు శుక్రవారం ఉదయం 10 గంటలకు వడపళని పోలీస్‌స్టేషన్‌లో హాజరై, తాము నివసిస్తున్న ప్రాంతం వివరాలు, బెదిరిస్తున్న వ్యక్తుల వివరాలను అందజేయాలని న్యాయమూర్తి ఉత్తర్వులు జారీచేశారు. ఈ దంపతులకు అవసరమైతే తగిన పోలీసు భద్రత కల్పించాల్సిందిగా ఆదేశాలు జారీచేశారు.

రాహుల్ క్షమాపణ చెప్పాలి

- పుదువైలో బీజేపీ ఎమ్మెల్యే ధర్నా



అసెంబ్లీ ప్రాంగణంలో ధర్నా చేస్తున్న బీజేపీ ఎమ్మెల్యే అశోక్‌బాబు

పుదుచ్చేరి, జూలై 2: పార్లమెంటు సమావేశాల్లో హిందువులను కించపరిచేలా మాట్లాడిన కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలంటూ పుదుచ్చేరిలో బీజేపీ నియామక ఎమ్మెల్యే అశోక్‌బాబు ధర్నా చేపట్టారు. ఆయన మంగళవారం ఉదయం పుదుచ్చేరి అసెంబ్లీ ప్రాంగణంలో ప్లకార్డుతో కూర్చొని, రాహుల్ హిందువులకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని నినాదాలు చేశారు.

హస్తినకు చేరిన పుదువై రాజకీయం

ఢిల్లీకి ఏడుగురు అసంతృప్త ఎమ్మెల్యేలు

అడయార్, జూలై 2: పుదుచ్చేరి రాష్ట్రంలోని భారతీయ జనతా పార్టీకి చెందిన ఎమ్మెల్యేల్లో అసంతృప్తి ఒక్కసారిగా బయటపడింది. దీంతో ఏడుగురు ఎమ్మెల్యేలు ఢిల్లీలో మకాం వేశారు. వీరిలో ఒక స్వతంత్ర ఎమ్మెల్యే కూడా ఉన్నారు. పుదుచ్చేరిలో ఎన్ఆర్ కాంగ్రెస్, బీజేపీ కలిసి సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగా, ముఖ్యమంత్రిగా రంగస్వామి ప్రమాణ స్వీకారం చేశారు. గత కొంతకాలంగా సాఫీగా సాగిపోతున్న ఈ సంకీర్ణ ప్రభుత్వ పాలనలో ఉన్నట్టుండి అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడ్డాయి. బీజేపీకి చెందిన ఎమ్మెల్యేల్లో మొదట ఐదుగురు తమ అసంతృప్తి బహిర్గతం చేయగా, ఇపుడు ఈ సంఖ్య ఏడుకు చేరింది. పైగా వీరంతా ఢిల్లీకి వెళ్లారు. మరోవైపు, బీజేపీ ఎమ్మెల్యేల అసమ్మతి సెగ సీఎం రంగస్వామికి తగిలేలా కనిపిస్తుంది. మరోవైపు అసమ్మతి ఎమ్మెల్యేలను బుజ్జగించే పనిలో బీజేపీ పెద్దలు నిమగ్నమైవున్నారు. ఇప్పటికే కేంద్ర న్యాయ శాఖామంత్రి అర్జున్ మేఘావాల్ వారితో సమావేశమై చర్చలు జరిపారు.

శంకర్ చేతిలో మూడు సినిమా కథలు



సెన్సేషనల్ డైరెక్టర్ ఎస్.శంకర్ చేతిలో మూడు స్టోరీలున్నట్టు వెల్లడించారు. అయితే, ఈ మూడు స్టోరీలు భారీబడ్జెట్‌తో నిర్మించే చిత్రాలని ఆయన పేర్కొన్నారు. భారీ బడ్జెట్ చిత్రాలకు పునాదులు వేసిన దర్శకుల్లో శంకర్ మొదటి వరుసలో ఉంటారు. ఆ సినిమాల కలెక్షన్లు కూడా అదే స్థాయిలో ఉంటాయి. ప్రస్తుతం ఆయన రూపొందించిన 'ఇండియన్-2' ఈ నెల 12న విడుదలకానుంది. ఆ తర్వాత టాలీవుడ్ హీరో రామ్ చరణ్‌తో 'గేమ్ చేంజర్' పేరుతో ఓ సినిమా తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా తర్వాత 'ఇండియన్-3'పై దృష్టిసారించనున్నారు. ఈ రెండు సినిమాల పనులన్నీ కొన్ని నెలల్లో పూర్తికానున్నాయి. ఆ తర్వాత ఎలాంటి చిత్రాలను నిర్మిస్తారని ఓ విలేకరి అడిగిన ప్రశ్నకు శంకర్ సమాధానమిస్తూ, 'ప్రస్తుతం నా వద్ద హిస్టారికల్, జేమ్స్ బాండ్, సైన్స్ ఫిక్షన్ స్టోరీలున్నాయి. అయితే, ఈ మూడు భారీ భారీ బడ్జెట్‌తో తెరకెక్కించే చిత్రాలు. వీటి నిర్మాణంలో ఎక్కువగా వీఎఫ్ఎక్స్ సన్నివేశాలు, కొత్త టెక్నాలజీతో పూర్తి చేయాల్సి ఉంటుంది' అని సమాధానమిచ్చారు.

చిత్రజ్యోతి



'బిగ్ బాస్' ఫేం రాజు

'బిగ్ బాస్' ఫేం రాజు హీరోగా 'బన్ బట్టర్ జామ్'

'బిగ్ బాస్' రియాల్టీ షోలో ఓ కంటెస్టుగా పాల్గొన్న రాజు జయమోహన్‌కు అదృష్టం వరించడంతో వెండితెరకు హీరోగా పరిచయమవుతున్నారు. 'బిగ్ బాస్ సీజన్-5'లో ప్రేక్షకులకు పరిచయమైన రాజు కథానాయకుడిగా దర్శకుడు రాఘవ్ మిర్దాత్ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ముఖ్యంగా నాగేష్, శివకార్తికేయన్ నటించిన 'ఎదిర్ నీచ్చల్' సినిమా తరహాలోనే తమ ప్రాజెక్టు ఉంటుందని దర్శకుడు చెబుతున్నారు. ఈ చిత్రానికి 'బన్ బట్టర్ జామ్' అనే పేరు ఖరారు చేసినట్టు దర్శకుడు చెప్పారు. రెయిన్ ఆఫ్ ఎంటర్‌టైన్మెంట్ పతాకంపై సురేష్ సుబ్రమణియన్ నిర్మిస్తున్నారు. ఈయన నిర్మించిన తొలి సినిమా 'ఎన్ని తుణిగ' మంచి విజయాన్ని సాధించిన విషయం తెల్సిందే. 'కాలంగలిల్ అవల్ వసంతం' అనే చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమైన రాఘవ్‌కు ఇది రెండో చిత్రం. ప్రస్తుతం ఈ చిత్రం చివరి దశ నిర్మాణ పనులను జరుపుకుంటోంది. మనిషిని ఎన్ని సమస్యలు చుట్టుముట్టిన ఆ క్షణాలను సంపూర్ణంగా ఆస్వాదిస్తూ జీవించడం అలవాటు చేసుకుంటే జీవితంలో సంతోషానికి లోటు ఉండదనే కాన్సెప్టుతో ఈ సినిమా రూపొందిస్తున్నారు. ఇతర పాత్రల్లో సీనియర్ నటి శరణ్య పొన్‌వణ్ణన్, దేవదర్శిని, చార్లీ, మైఖేల్ తంగదురై, వీజే పప్పు తదితరులు నటించారు. ఈ నెల 8వ తేదీన ఈ సినిమా ఫస్ట్‌లుక్ విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు.



'కంగువా'లో సూర్య

'వేట్టయాన్'తో పోటీ పడుతున్న 'కంగువా'

హీరో సూర్య - దర్శకుడు చిరుత్తై శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న చిత్రం 'కంగువా'. దసరా పండుగను పురస్కరించుకుని అక్టోబరు పదో తేదీన ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ చేయనున్నట్టు అధికారికంగా ప్రకటించారు.ఇదే రోజున సూపర్‌స్టార్ రజనీకాంత్ 'వేట్టయాన్' చిత్రం కూడా విడుదల చేయనున్నట్టు ఇప్పటికే ప్రకటించారు.దీంతో ఈ రెండు చిత్రాలు ఇపుడు దసరా రేసులో నిలబడడంతో ఇటు తలైవర్, అటు సూర్య అభిమానుల ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. కాగా, 'కంగువా' చిత్రాన్ని యూవీ క్రియేషన్స్‌తో కలిసి బడా నిర్మాత కేఈ జ్ఞానవేల్ రాజా.... స్టూడియో గ్రీన్ పతాకంపై భారీ బడ్జెట్‌తో పదికి పైగా భాషల్లో తెరకెక్కిస్తున్నారు. బాలీవుడ్ నటి దిశా పఠానీ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో బాంబీ డియోల్, యోగిబాబు, రెడిన్ కింగ్‌స్లీ వంటి అనేక మంది నటిస్తున్నారు. వెట్రి పళనిస్వామి ఛాయాగ్రహణం అందించిన ఈ చిత్రానికి దేవీశ్రీ ప్రసాద్ సంగీతం. ఇందులో హీరో సూర్య రెండు పాత్రలను పోషించారు. ఈ నేపథ్యంలో ఈ చిత్రం విడుదల తేదీన నిర్మాణ సంస్థ అధికారికంగా వెల్లడించింది.



విజయ్ సరసన సమంత?

అగ్రహీరో విజయ్ 69వ చిత్రంలో హీరోయిన్‌గా సమంతను ఎంపిక చేసినట్టు కోలీవుడ్ వర్గాల సమాచారం. ప్రస్తుతం విజయ్ 68వ చిత్రంలో నటిస్తున్నారు. వెంకట్ ప్రభు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి 'ది గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్' అనే టైటిల్ ఖరారు చేసిన విషయం తెల్సిందే. కల్పాతి అఘోరం భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ చిత్రంలో స్నేహ, లైలా, ప్రభుదేవా, ప్రశాంత్, అజ్మల్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. సెప్టెంబరు 5న విడుదలకానున్న ఈ చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం. ఈ నేపథ్యంలో విజయ్ తన 69వ చిత్రానికి కూడా నటించేందుకు కమిట్ అయ్యారు. ఈ సినిమా పూర్తి చేసి ఆయన సినిమాలకు పూర్తిగా స్వస్తి చెప్పే అవకాశం ఉన్నట్టు వార్తలు వస్తున్నారు. అయితే, ఈ చిత్రంలో హీరోయిన్‌గా సమంత పేరును ఖరారు చేసినట్టు సమాచారం. ఈ ప్రాజెక్టును నవంబరులో సెట్స్‌పైకి తీసుకెళ్ళనున్నారు.

న్యాయచట్టాలపై తమిళ గ్రంథాలు

● ఆవిష్కరించిన సీఎం స్టాలిన్

అడయార్, జూలై 2: రాష్ట్ర న్యాయ అధికార భాషా సంఘం (స్టేట్ స్టాట్యూటరీ లాంగ్వేజ్ కమిషన్) తమిళంలోకి అనువాదం చేసిన 100 న్యాయ గ్రంథాలను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆవిష్కరించారు. వీటిలో 37 కేంద్ర చట్టాలు, 63 రాష్ట్ర చట్టాలకు సంబంధించిన గ్రంథాలున్నాయి. దివంగత మాజీ ముఖ్యమంత్రి కలైంజర్ కరుణానిధి శతజయంతి వేడుకలను పురస్కరించుకుని ఈ గ్రంథాలను తమిళంలోకి తర్జుమా చేసే చర్యలు చేపట్టారు. ఈ అనువాద ప్రక్రియ పూర్తి కావడంతో ఈ వంద గ్రంథాలను సచివాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో స్టాలిన్ మంగళవారం ఆవిష్కరించారు. వీటిని "www.tn.gov.in అనే వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కూడా కల్పించారు. ఈ గ్రంథాల ఆవిష్కరణ కార్యక్రమంలో రాష్ట్ర న్యాయశాఖామంత్రి రఘుపతి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివ్‌దాస్ మీనా, న్యాయ శాఖ కార్యదర్శి జార్జ్ అలెగ్జాండర్, రాష్ట్ర న్యాయ అధికార భాషా సంఘం చైర్మన్ రిటైర్డ్ జడ్జి తారణి, సభ్యులు గోపి రవికుమార్, మహ్మద్ జియాబుదీన్ తదితరులు పాల్గొన్నారు.



న్యాయచట్టాలపై తమిళంలో ముద్రించిన గ్రంథాన్ని ఆవిష్కరించి న్యాయశాఖ మంత్రి ఎస్.రఘుపతికి అందజేస్తున్న సీఎం స్టాలిన్



కార్ ర్యాలీ వివరాలు మీడియాకు తెలియజేస్తున్న నీనా రెడ్డి, అమిత్ తదితరులు

7న మహిళల కార్ ర్యాలీ

ప్యారీస్, జూలై 2: డచ్చస్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 7న నగరంలో మహిళల కార్ ర్యాలీ నిర్వహించనున్నట్లు సవేరా హోటల్ అధినేత, ర్యాలీ నిర్వాహకులు నీనా రెడ్డి తెలిపారు. మైలాపూర్‌లోని సవేరా హోటల్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో నీనా రెడ్డి మాట్లాడుతూ... గ్రేటర్ చెన్నై చరిత్రను నగరంలో స్థిరపడిన పొరుగు రాష్ట్రాల వారు తెలుసుకొనేలా గత 23 సంవత్సరాలుగా మహిళల కార్ ర్యాలీని విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వచ్చే ఆదివారం ఉదయం 8 గంటలకు సవేరా హోటల్ ప్రాంగణం నుంచి బయల్దేరనున్న ర్యాలీలో 100 కార్లు పాల్గొంటున్నాయని, ఒక్కొక్క కారులో నలుగురు మహిళలుంటారని, 50 నుంచి 65 కి.మీ మేరకు ఈ ర్యాలీ సాగుతుందన్నారు. ఏఏ మోటార్స్ స్పోర్ట్స్ సొల్యూషన్స్ అనుమతితో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం లేకుండా నిర్వహించనున్న ఈ ర్యాలీలో పాల్గొనదలచిన వారు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదుచేసుకుంటున్నారని తెలిపారు. వేగం ప్రధానం కాకుండా మహిళల్లో డ్రైవింగ్ నైపుణ్యం పెంపొందింపజేయడమే లక్ష్యంగా ఇండియాలోనే ఒక్క డచ్చస్ క్లబ్ మాత్రమే ఈ ర్యాలీ నిర్వహిస్తుందని తెలిపారు. నగరంలో చారిత్రాత్మక కట్టడాలు సందర్శించడం, పర్యాటక ప్రాంతాలను సందర్శించే పోటీదారులు వాటి ఫొటోలు కూడా తీసి సమర్పిస్తారని, ప్రవేశరుసుముగా రూ.1,500 నిర్ణయించామని, ఆరు కేటగిరీల్లో విజేతలకు విలువైన బహుమతులు పంపిణీ చేయనున్నట్లు నీనా రెడ్డి తెలిపారు.



చెన్నైలో జరిగిన అన్నా విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో ఓ విద్యార్థినికి పట్టాను ప్రదానం చేస్తున్న గవర్నర్ ఆర్ఎన్ రవి

78 అడుగులకు చేరిన కబిని డ్యామ్ నీటిమట్టం

మేట్టూరు డ్యామ్‌లో పెరిగిన ఇన్‌ఫ్లో

చెన్నై, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని కబిని డ్యామ్ నీటిమట్టం మంగళవారం వేకువజామున 78 అడుగులకు పెరగటంతో రాష్ట్రసరిహద్దులో ఉన్న బిలిగుండు ప్రాంతానికి సెకనుకు 1500 ఘటనపుటడుగుల చొప్పున జలాలు ప్రవహిస్తున్నాయి. అక్కడి నుంచి ఆ జలాలు సేలం జిల్లా మేట్టూరు ప్రాంతానికి చేరుతున్నాయి. దీంతో మేట్టూరు డ్యామ్‌లో ఇన్‌ఫ్లో క్రమంగా పెరుగుతోంది. మంగళవారం ఉదయం మేట్టూరు డ్యామ్‌లోకి సెకనుకు 876 ఘనపుటడుగుల చొప్పున జలాలు వస్తున్నాయి. దీంతో డ్యామ్‌లో నీటిమట్టం 39.70 అడుగులకు చేరింది. డ్యామ్ నుంచి సెకనుకు 1000 ఘనపుటడుగుల చొప్పున జలాలు విడుదలవుతున్నాయి. ప్రస్తుతం మేట్టూరు డ్యామ్‌లో 11.93 టీఎంసీల మేరకు నీటి నిల్వలు ఉన్నట్లు ఇరిగేషన్ విభాగం అధికారులు ప్రకటించారు.



కబిని డ్యామ్ నుంచి విడుదలవుతున్న జలాలు

ఆరోగ్య శిబిరానికి వరల్డ్ రికార్డు గుర్తింపు



వరల్డ్ రికార్డు ధృవీకరణ పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

అడయార్, జూలై 2: శ్రీ రామచంద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హైయ్యర్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్‌కు చెందిన ది రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో వరల్డ్ రికార్డు స్థాయిలో పాఠశాల విద్యార్థుల కోసం మెగా హెల్త్ క్యాంపు నిర్వహించింది. గత శనివారం జరిగిన ఈ మెగా ఆరోగ్య శిబిరంలోసేతు భాస్కర మెట్రిక్యులేషన్ హైయ్యర్ సెకండరీ స్కూల్‌కు చెందిన 8 నుంచి 15 యేళ్ళలోపు 550 మందికిపైగా విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో పీడియాట్రిక్స్, డెంటల్, ఆప్తమాలజీ, ఆడియాలజీ, స్పీచ్ లాంగ్వేజ్ థెరపీ, ఫిజియోథెరపీ, మైండ్ బాడీ మెడిసిన్, లైఫ్ స్టైల్ సైన్సెస్, మైక్రోబయాలజీ, క్లినికల్ న్యూట్రిషన్ ఇలా పలు విభాగాలకు చెందిన 150 మంది వైద్యులు పాల్గొని విద్యార్థులకు వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. ఈ హెల్త్ క్యాంపును స్వయంగా పర్యవేక్షించిన ఆసియా పసిఫిక్ రికార్డ్స్ ఆఫీసర్ షెరిఫా... వరల్డ్ రికార్డు యూనియన్‌కు సిఫార్సు చేయగా, ఈ మెగా హెల్త్ క్యాంపును వరల్డ్ రికార్డుగా ప్రకటించారు. ఈ వరల్డ్ రికార్డు సర్టిఫికెట్, మెడల్‌ను రొట్రాక్ క్లబ్ ప్రెసిడెంట్ అరుణ్ సుబ్రమణియన్, జాయింట్ సెక్రటరీ డాక్టర్ యశ్వంత్‌లు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామచంద్ర హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.సురేంద్రన్, మెడికల్ డైరెక్టర్ ఆర్‌బీ సుధాకర్ సింగ్ తదితరులు పాల్గొనగా, ఈ బృందాన్ని ఎస్ఆర్ఎంసీ యూనివర్సిటీ చాన్సెలర్ వీఆర్ వెంకటాచలం, వైస్ చాన్సలర్ డాక్టర్ ఉమా శేఖర్, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ మహేష్ వకమూడి, డీన్ మెడికల్ కాలేజీ డాక్టర్ కె.బాలాజీ, ప్రిన్సిపాల్ సెల్వ కుమార్ తదితరులు అభినందించారు.



సోలో షో ప్రారంభించిన కేఎస్‌వీవీ ప్రసాద్, పా.రంజిత్ తదితరులు

ఆర్ట్ హౌజ్ గ్యాలెరీ ఆధ్వర్యంలో 'సోలో షో'

అడయార్, జూలై 2: నగరానికి చెందిన ఆర్ట్ హౌజ్ గ్యాలెరీ ఆర్టిస్ట్ విజయ్ పిచ్చుమణికి చెందిన సోలో షో నిర్వహించింది. 'బై నేచర్స్ ఫోర్స్ : వెలి వెట్రిద మాక నగర్‌కిరదు' అనే టైటిల్‌తో జరిపింది. స్థానిక లలిత కళా అకాడెమీలో జరిగిన ఈ షోకు చీఫ్ గెస్టుగా కస్టమ్స్ కమిషనర్ (దిగుమతులు) కేఎస్‌వీవీ ప్రసాద్, సినీ దర్శకుడు పా.రంజిత్, రాయన్ ఇబ్రహీం ఆర్కిటెక్ట్స్ ప్రిన్సిపాల్ రాయన్ ఇబ్రహీం, ఆర్ట్ హిస్టోరియన్ డాక్టర్ అష్రాఫి ఎస్.భగత్, నటుడు జో మల్లూరి తదితరులు పాల్గొన్నారు. ఇది సంప్రదాయం, మానవ అనుభవాలు, అనుబంధాలు, సమూహం, జ్ఞాపకశక్తి, ప్రకృతిపై ఆలోచనలు రేకెత్తించేలా కళాకారుడు విజయ్ పిచ్చుమణి రూపొందించారు. కన్నియాకుమారి జిల్లాలోని ఒక చిన్న గ్రామం నుంచి ఈ స్థాయికి చేరుకోవడం సంతోషంగా ఉందని ఈ సందర్భంగా విజయ్ పిచ్చుమణి వ్యాఖ్యానించారు.

రూ.1000కోట్లకు పెరిగిన సీఐఈఎల్ హెచ్‌ఆర్ గ్రూపు ఆదాయం



మీడియా సమావేశంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ పాండ్యరాజన్, నిర్వాహకులు

చెన్నై, జూలై 2 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల సిబ్బంది నియామకాలు తదితర సేవలందిస్తున్న సీఐఈఎల్ హెచ్‌ఆర్ గ్రూపు ఆదాయం రూ.1000కోట్లు దాటిందని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ కే. పాండ్యరాజన్ తెలిపారు. నగరంలో మంగళవారం మధ్యాహ్నం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2015లో ప్రారంభించిన తమ సంస్థ అంచెలంచెలుగా ఎదిగి లండన్‌కు చెందిన బ్రాండ్ ఫైనాన్స్ సంస్థ గుర్తింపు కూడా సాధించినట్లు చెప్పారు. తమ సంస్థకు దేశవ్యాప్తంగా 92 కార్యాలయాలున్నాయని, వాటిలో 14 కార్యాలయాలు తమిళనాడులో పనిచేస్తున్నాయని ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న నాన్‌ముదల్వన్ పథకం కింద తమ సంస్థ ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల భాషా బోధన కార్యక్రమాలను కూడా చేపడుతోందని చెప్పారు. తమ గ్రూపులో మాఫాయ్, హెచ్‌ఫాక్టర్, జుంబే, కోర్స్‌ప్లే వంటి ప్రముఖ సంస్థలు విలీనం కావటంతో తొమ్మిదేళ్లలోపు సంస్థ ఆదాయం రూ.1086 కోట్లకు చేరిందని వివరించారు. మీడియా సమావేశంలో సీఐఈఎల్ హెచ్‌ఆర్ గ్రూపు డైరెక్టర్ లతా రాజన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆదిత్యనారాయణ్‌మిశ్రా, మాఫాయ్ మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ కృష్ణన్ తదితరులు పాల్గొన్నారు.



విక్రవాండి నియోజకవర్గం కుత్తాంపూండిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రులు సీవీ గణేషన్, పీకే శేఖర్‌బాబు



చెన్నై క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ దంపతులను కలిసి తన కుమారుడి వివాహ నిశ్చితార్థ ఆహ్వాన పత్రికను వారికి అందజేస్తున్న ప్రముఖ సినీ నటుడు నెపోలియన్



చెన్నై సచివాలయంలో తమిళభాషాభివృద్ధి సమాచార శాఖలలో డ్రైవర్ పోస్టులకు ఎంపికైన ముగ్గురికి నియామక పత్రాలు అందజేసిన ఆ శాఖ మంత్రి ఎంపీ సామినాధన్



చెన్నై క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు తన కుమారుడి వివాహ ఆహ్వాన పత్రికను అందజేస్తున్న మేల్ మరువత్తూరు బంగారు అడిగలార్ తనయుడు కేపీ అన్బళగన్